# రామాయణ రహస్యాలు



ఆచార్య కొత్త సత్యనారాయణ చౌదరి

# సూచిక


| | | |
|---|---|---|
| 1. | అవతారిక | 1 |
| 2. | పాయస ప్రదానము | 5 |
| 3. | ఆంజనేయుని యవతారము | 9 |
| 4. | వశిష్ఠుని వంగసము | 14 |
| 5. | పరశురాముని బ్రదుకు | 18 |
| 6. | శ్రీరాముఁడు ఏకపత్నీ వ్రతుఁడా! | 21 |
| 7. | సీతారాముల మాంసాహారము | 30 |
| 8. | పితృవాక్యపరిపాలనములో రాక్షససంహార ప్రసక్తి | 39 |
| 9. | 'బ్రాహ్మణో మమ దేవతా' | 63 |
| 10. | రామలక్ష్మణుల భార్యావియోగ ప్రసక్తి | 68 |
| 11. | సీతావియోగము | 72 |
| 12. | అగ్నిపరీక్ష | 78 |
| 13. | సీతాన్వేషణము | 81 |
| 14. | వాలి వధ | 84 |
| 15. | సుగ్రీవుని శీలము | 96 |
| 16. | హనుమత్సందేశము | 102 |
| 17. | విభీషణ శరణాగతి | 119 |
| 18. | కులద్రోహి | 130 |
| 19. | అయోధ్యా ప్రవేశము | 135 |
| 20. | రామరాజ్యము | 140 |

# రామాయణ రహస్యాలు

## అవతారిక

**రా**మాయణ – మహాభారత – భాగవతములు ఆర్ష గ్రంథములనియు భారతీయుల ప్రాచ్యసంస్కృతికి అవే మూలకందములనియు వానిని నిత్యము పారాయణముగాఁ బఠింపవలెననియు భారతీయులలోఁ గొందఱిలో ఈ భావము రూఢియైపోయినది. ఆ మూఁడింటిలోని ఇతివృత్తమునే వస్తువుగాఁ గైకొని సంస్కృతవాఙ్మయమందేగాక దేశ్యభాషలలోఁ గూడ అనువాదములుగా అనుకరణములుగా స్వతంత్రములుగా ఎన్నో గ్రంథములు పుట్టినవి; పుట్టుచున్నవి. అనుచితమైన వస్తువును బరిహరింపవచ్చునన్న పరిభాషచేఁ దమకు రుచింపని ఘట్టములను సమగ్రముగాఁ దీసివైచి కాలమునుబట్టి దేశమునుబట్టి సంఘమునుబట్టి ఆ పూర్వకథలకు ఎన్నెన్నో మార్పులుకూర్పులు చేసి కొంగ్రొత్త కావ్యములు నిర్మించిన వారును గలరు. కావుననే వాల్మీకిసీత వేఱుగా – 'భాస' ప్రభృతి మహాకవుల సీత వేఱుగా భాసించుచుండును. వ్యాసుని శకుంతలాదుష్యంతులకు కాలిదాసశకుంతలాదుష్యంతులకుఁ గావలసినంత భేదము కలదు. రామాయణభారతగాథలు భాసమహాకవిచేతిలో విచిత్రముగా మాఱినవి. వాల్మీకములోని కథలకు ఆవల–పుట్టిన రామాయణకథలకుఁ గొండంత భేదము కొట్ట వచ్చినట్టు కన్పట్టును. వాల్మీకములోని అహల్యకథనే అనేకులు అనేకవిధాలంఁ జిత్రించినవారు గలరు. ఇంతకు – ఏ యహల్య, మొదటివ్యక్తి – ఏ సీత, పురాణసీత – ఏ కథలు భారతకథలు, అన్న రహస్యమును గుర్తిపవలెనన్న సంస్కృతాంధ్రములనుబట్టి సాధ్యమేకాదు. పోనీ, కావ్యములమాట ఎట్లున్నను శాస్త్రాలజోలికిఁ బోయినను ఈ తికమకలు తప్పుటలేదు. మనువు చెప్పినదానినే గౌతముఁడు మార్పుచేసి మఱొకతీరుగ శాసించెను. పరాశరస్మృతిలో మఱొకత్రోవ చూపట్టును. ఆహార

విహారములలో – నీతి ప్రవర్తనములో – సాంఘిక జీవనములో కావ్యములు శాస్త్రములు తల కొక విధముగా శాసించిన ఘట్టములు అనేకము లున్నవి.

ఈ ధోరణి గమనించియే 'బహుధావిప్రతిపత్తి ధీవిభవముల్ పాడైన శాస్త్రార్థముల్' – ఇత్యాదిగ శ్రీనాథ మహాకవి బాహాటముగ ఏవగించుకొనెను. ఈ భేదభావములను సమన్వయించుకొని ఒక కొలికిఁ దెచ్చివాని మంచి సెబ్బఱలు చూడవలెనని విమర్శకుల ధోరణి. ఈ పురాణ వాఙ్మయమును కేవలచరిత్రగా భావింపరాదు. ఎవని యూహకుఁ దగినట్లు ఆ యా పాత్రలను జిత్రించి మనకుఁ జూపించిరి. కావ్యముగా ఆ భాగమును గైకొని ఆనందింప వచ్చునుగాని అందలిపాత్రలను అన్నివిధాల ఆదర్శములుగా భావింపవలె ననుట అర్థము లేని మాట. పురాణకథలను గైకొని పాడినదే పాటగా వ్రాసిన భాగమే మఱల వ్రాయుచు, అది పుణ్యము – పురుషార్థము, అన్న ధోరణిలో సార్థకత నిరూపించుకొనుట మనలోఁ గొందఱికి సంప్రదాయమైనది. ఒకే కథను గైకొని వందలుగా – వేలుగా గ్రంథములు పుట్టుటలోని విశేష మిట్టిదే యనవచ్చును.

ప్రపంచములోనే వాల్మీకి ఆదికవియని ప్రసిద్ధి కద్దు. వైదిక వాఙ్మయములోనే కవితాసృష్టి యున్నను లౌకిక వాఙ్మయమునకు వాల్మీకమే పునాది యనుటలో విప్రతిపత్తి లేదు. వాల్మీకికి బిదప వేదవ్యాసుఁడు రెండవకవి. ఈ యిరువురు ఆర్షకవులు. వీరినిబట్టియే 'నా నృషిః కురుతే కావ్య'మ్మను నానుడి వెలసినది. అష్టాదశపురాణము లన్నపేరితో వేద వ్యాసుని వాఙ్మయము ఎంతో ఉన్నట్లు కన్పించును. ఇది యంతయు ఆయన సృష్టియనుట అత్యుక్తి. అచ్చముగా ఆయన పలికినది కాదనియు, ఆయన శిష్యులు – సన్నిధానవర్తులు అనేకులు ఆ వాఙ్మయములో పెక్కింటికి కర్తలనియు రాను రాను ఆ యా భాగములలో ప్రక్షిప్తము లనేకములు దూరిన వనియుఁ జెప్పుట కాధారములు అనేకము లున్నవి. దీనిని బట్టియే ద్రౌపదీ వస్త్రాపహరణమువంటి ఘట్టములు లేని భాగములు సంస్కృతవాఙ్మయములోనే గాక దేశ్యభాషలలోఁ గూడఁ గన్పించుచున్నవి.

సంస్కృతవాఙ్మయములో మహాభారతమున కున్న స్థానము చాల దొడ్డది. వస్తువులో రామాయణముకన్న భారతము నాలుగురెట్లు గొప్పది కావచ్చును. కాని కవితా ధోరణిలో సంస్కృత భారతముకన్న వాల్మీకము మిన్నయనుట అపచారము కాదు. 'మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షి'. ఇత్యాదివాక్యములే గాక కాలిదాసాది మహాకవు లెందఱికో వైదర్భీగుణవిరాజితమైన వాల్మీకము ఆదర్శమైనదనుట స్తవము కాదు; వాస్తవము. వాల్మీకి రచనలోని హృద్యమైన ధోరణిని బట్టియే గాక అందలి పాత్రలనుబట్టి కూడఁ గొందఱికి రామాయణము పారాయణగ్రంథముగా భారతీయులలో ప్రఖ్యాతి కలిగినది.

రామాయణభారతకథలు గ్రంథములుగా ఉద్భవించిన దెప్పుడన్న ఘట్టములో వివాదము లేక పోలేదు. రామాయణ కథ అసలు జరిగెనో లేదో అన్నమాట ఆవల

# వశిష్ఠుని వంగసము

**వ**శిష్ఠులనగా – పురోహితులని నేఁడు దేశములో వాడుక వచ్చినది. ఇంద్రుఁడనఁగా ఒక వ్యక్తి కాఁడనియు– అదియొక పదవి యనియు ఆ పదవి నందుకొన్నవా రందఱు దేవేంద్రులనియుఁ గొందఱందురు. అట్లే 'వ్యాస' పదవాచ్యులు కూడ అనేకులున్నట్లు వచింతురు. కాని 'అరుంధతీపతి' యని పేరు వడసిన వశిష్ఠుఁడు సూర్యవంశములో నాలుగైదు తరాలవఱకు పురోహితుఁడుగా – నియంతగా జీవించినట్లు తెలియుచున్నది.

అసలు ప్రాచీనఋషుల కెవ్వరికిని ఆదిలో కులగోత్రములన్నవి లేనేలేవు. అప్పటికి వివాహాదిసంస్కారములుకూడ లేవనుటకు అనేకతార్కాణము లున్నవి. కానీనులుగా పుట్టి సంస్కారము కలిగి మహర్షులైనవారు, కన్యాప్రాయములో దారిని బోవు దానయ్యలను గలసి గర్భములు దాల్చి పుట్టిన పిల్లలను బాఱవైచి ఆవల పెండ్లిండ్లు చేసికొని పతివ్రతామణు లుగ పురాణాలకెక్కిన 'నాపసాను' లెందఱో కలరు. ఇట్టివారు – ఇట్టివారి బిడ్డలే చాలమంది మనకు ఆదర్శ వ్యక్తులుగా ఆరాధింపఁబడుచున్నారు. పురాణాలలో రంకులకు బొంకులకుఁ గఱవులేదన్నమాట జ్ఞప్తియం దుంచుకొని ఈ కథను బరిశీలింపఁగోరుదును:–

ఒకప్పుడు సూర్యభగవానుఁడు వరుణదేవుఁడు కలసి ప్రయాణము చేయుచున్నారఁట. దారిలో వారికి దేవాంగన ఊర్వశి ఎదురయ్యెను. ఆబిడ జగదేకసుందరి యగుటచే, ఆబిడను జూడఁగానే ఆ పెద్ద లిర్వురకురేతః స్ఖలన మయ్యెనఁట. అది గాంచిన ఊర్వశి వెంటనే ఆ వీర్యమును కుండలో భద్రపఱచుకొనెనఁట. ఆ వీర్యము నుండియే వశిష్ఠులవారు– అగస్త్యులు జన్మించిరఁట. అందువలననే అగస్త్యులవారిని 'కుంభసంభవు'లని పిలిచెదరు. వీరి జన్మగాథ లిట్టివి. ఇట్టివి బయట పెట్టినచో గుట్టుమట్టులు తెలిసి వారియెడ అనాదర మేర్పడునేమో! తన్మూలమునఁ దమ పొట్టలు మాడునేమో! అన్న జంకుచే కుక్షింభరులు – స్వార్థపరులు. మహాత్ములయు మహానదులయు పుట్టు పూర్వములనుగూర్చి ఎత్తరాదని ఆంక్ష విధించిరి.

శ్లో॥ 'గణికాగర్భసంభూతో వశిష్ఠశ్చ మహామునిః,
తపసా బ్రాహ్మణోజాతస్సంస్కారస్తత్రకారణమ్!
జాతౌ వ్యాసస్తు కైవర్త్యా ఉ శ్వపాక్యాస్తు పరాశరః
బహవో న్యేపి విప్రత్వం ప్రాప్తాయే పూర్వ మద్విజాః'॥

వేశ్యాసుతుఁడు వశిష్ఠుఁడు విప్రుఁడై మహర్షి అయ్యెను. ఆతని మనుమఁడు - మునిమనుమఁడు మాలెతకు పల్లెతకు బిడ్డలై పుట్టి మహాద్విజులై మహర్షులై మహావాఙ్మయకర్తలై ఆదర్శవ్యక్తులై ఆరాధింపఁబడుట అతివిచిత్రము. పోనీ, ఆదిలో అల్పులుగాఁ బుట్టిన ఆ వ్యక్తులు సంస్కారములవలన మహావ్యక్తులైరని గమనింపక గమనించియు గణుతింపక, నేఁడు కులగోత్రము లనుపేరట సాటిమానవులను బంధించి. హెచ్చులొచ్చులు నిర్ణయించి సంఘములో చెలామణి యగుచుండుట చిత్రవిచిత్రము అనఁగా వీరిదృష్టిలో త్రాగుఁబోతువానిబిడ్డను త్రాగుఁబోతు వానిగానే చూడవలెను. మెడలో జందె మున్నవానికి! బుట్టినంతమాత్రాన వానిని విప్రుఁడుగానే నిర్ణయింపవలెను. ఇది యంతయు చాతుర్వర్ణ్యపరిస్థితిలో అంతర్గతమై యున్న మహాదోషము.

గణికాపుత్రుఁడైన వశిష్ఠునకు మాలెతయైన అరుంధతి ధర్మపత్ని అయ్యెను. ఆమె పరమపతివ్రతయఁట. ఆ దంపతులు పుణ్యమూర్తులఁట. వారికి ఎందఱో మగబిడ్డలు పుట్టిరి. వారిలో పెద్దవాఁడు 'శక్తి' యనువాఁడు. ఆ 'శక్తి' కొడుకే పరాశరుఁడు; వానికి దారిలో ఏటియొడ్డున ఆకస్మికముగ అవతరించినవాఁడే వ్యాసుఁడు. పుట్టఁగానే గడ్డము మీసములతో ఒడ్డుపొడవు గలిగి కన్పించిన ఆ బిడ్డయే వేదవ్యాసుఁడై అష్టాదశపురాణ కర్తయై 'వ్యాసో నారాయణతో హరిః' అని కీర్తింపఁబడెను. ఇట్టివారే 'సద్యోగర్భసంజాతు'లఁట. సద్యోగర్భమునఁగా సంభోగానంతరమే పుత్రోత్పత్తి యని కొందఱందురు. వ్యాసుని జన్మ మిట్టిదేయని వీరి భావము. అది కాదు, ఏకపర్యాయ సంభోగముచేతనే గర్భధారణ మగుట సద్యోగర్భమని మఱి కొందఱందురు. ఒక కుటుంబములో సక్రమముగా వివాహితులగు దంపతులకు జన్మించిన సంతానము గాక, విపరీతముగా జన్మించిన వారందఱు ఇట్లే వ్యవహరింపఁబడుచున్నారు. వ్యాసుఁడు - ధృతరాష్ట్రుఁడు పాండురాజు - విదురుఁడు - పాండవులు - కర్ణుఁడు - హనుమంతుఁడు - ద్రుపదుఁడు - ద్రోణుఁడు - కృపుఁడు - కృపి - శకుంతల ఇట్టివారు ఈ శ్రేణిలో+ జేరెదరు.

ఈ ఘట్టములో 'విజయవిలాసకర్త' ఇట్లన్నాఁడు:-

ఈగతి రతి కేళీసుఖ
సాగరమునఁ దేలియున్న సమయంబునఁ ద
ద్యోగం బెటువంటిదొ స
ద్యోగర్భంబున సుపుత్త్రుఁ డొకఁ డుదయించెన్.

(1 ఆ. 176 ప.)

కానీనుఁడైన ఆ వ్యాసుఁడే, మాఱుమనువులో మహా రాజ్ఞియై సత్యవతియని పేరు

# సీతారాముల మాంసాహారము

వైదికయుగమునుండి ఈ దేశములో మాంసాహారము వైదికాహారముగా నిర్ణీతమై యున్నది. బుద్ధభగవానుని ఆవిర్భావము తరువాతనే విశిష్య దక్షిణాపథములో మాంసాహారము దోషముగా ఆచారములోఁ గన్పించుచున్నది. జంతువులలో దేనిమాంసము రుచికరమో ఏది ఏ సమయములోఁ దినఁదగినదో తినవలయునో ఆర్షజాతికిఁ దెలిసినట్లు ఇతర ప్రపంచమునకు ఇప్పటికిఁగూడఁ దెలియదనవచ్చును. ప్రపంచములో నేఁడు ముప్పాతిక మువ్వీసము మాంసాహారమును విధిగాఁ దీసికొను సంప్రదాయము కన్పింపఁగా – ఆ యాహారము పాపకరమని అది తీసికొనుజాతి రాక్షసజాతి వంటిదని అది బుద్ధిసూక్ష్మతను గల్పింపదని సాత్త్వికాహారులే సూక్ష్మబుద్ధులని ఏదో ఒక విధమైన భ్రాంతి ఈ దేశములో ఇటీవల ఏర్పడినది.

మాంసము తినవలెనని ఈ రచయిత భావము కాదు సుమా! ఈ యాహారవిషయము లోని పూర్వాపరములు పేర్కొనుటయే ప్రకృతవక్తవ్యాంశము.

అతిథిపూజలోఁగానీ ఆబ్దికాదులలోఁగాని మాంసాహారము ప్రశస్తము; ప్రశస్తమే కాదు; విధ్యుక్తము. అది పెట్టనినాఁడు అపచారమే కాదు; అనర్థావహము అన్నంత దాఁక శాస్త్రము చెప్పినది. ఆచార మేర్పడినది. వైదిక పరిభాషలో 'గోఘ్నః' అనఁగా అతిథియని అర్థమున్నది. "అతిథి ర్గోఘ్నః' గోఘ్నః– అనఁగా ఆవును జంపువాఁడనియు అర్థము. ఏదైన ఒట్టు పెట్టుకొనుపట్టున, పితృదేవతలకు పెట్టు శ్రాద్ధాదికములో మాంసాహారము పెట్టనివాఁడు– పెట్టినపుడు తిననివాఁడు పోవు దుర్గతికి నేను బోఁగల నన్నంత రూఢికి ఈ మాంసాహార ఘట్టము సిద్ధమైనది. శ్రాద్ధమందు విధ్యుక్తముగా వడ్డించిన మాంసమును దినని ద్విజుఁడు ఇరువది యొకటవ జన్మములో పశువుగాఁ బుట్టుననియు, మంత్రపూర్వకముగాఁ జంపిన పశువును ద్విజుఁడు తినవచ్చుననియుఁ దినవలెననియు ఋగ్వేదములోనే గాక మనుస్మృతిలోఁగూడ స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. ఒక్క మనుస్మృతియే కాదు; ధర్మశాస్త్రము లన్నియు మాంసాహారము శ్రేష్ఠమని శాస్త్రీయమని విశిష్య – గోమాంసము శ్రేష్ఠతమమని పదేపదే ఘోషించినవి. అందువలననే 'గో – బ్రాహ్మణేభ్యః శుభమస్తు

నిత్య’మ్మను పల్లవి ప్రతిఘట్టములోను పారాయణముగా పఠింపఁబడు చుండును. గోమాంసము రుచికరము కావున బ్రాహ్మణ్యమునకు గోవులకు ఉన్న సంబంధ మిట్టిదని గుర్తింపవలెను. వానిని మేఁపుట – కాచుట మున్నగు పనులన్నియు ఇతరులు చూడవలెను. వాని పాలు – పెరుగు. అక్కఱయైనప్పు డెల్ల వాని మాంసము ఆరగించుటమాత్రము వీరిపని. నేఁడుకొన్ని ప్రాంతములలో ‘గోరక్షణ – గోవధనిషేధము’ ఇత్యాది నినాదములు వినవచ్చుచుండును. ఆర్యజాతి ప్రాచీన చరిత్ర ప్రాచీనాచారములు పరిశీలించినచో ఈ నినాదములలో అర్థము లేదనియు, ఏనాఁడో భారతీయులే – అనఁగా హైందవులే ‘గోవధ’ అనుస్యూతమైన అవిచ్ఛిన్నమైన సదాచారముగాఁ జేసిరనియు, ఈ వంకతో క్రొత్తగాఁ గని పెట్టినట్టు – ఇది దురాగతమన్నట్టు ఇతరమతముల జోలికి మతాంతరుల ప్రసక్తికిఁ బోవలసిన పని లేదనియు స్పష్టమగుచున్నది. మన మెఱిఁగిన ఆంగ్లేయ పరిపాలనములో ఆంగ్లభాషావేత్తలైమహోన్నతో ద్యోగము లందుకొన్న శ్రోత్రియకుటుంబములోని పెద్దలే కొందఱు, మహాపట్టణములలోని ‘కాస్మాపాలిటన్ క్లబ్బు’లలో సున్నితమైన ఆవుల నాలుకలచే రుచికరముగాఁ జేయఁబడిన ఆహారపదార్థములను ఆరగించుటయు – ఆ యారగింపే సభ్యతా చిహ్నమన్నట్లు నాగరకతాస్ఫోరకమన్నట్లు సంచరించుటయు గుర్తింపవలెను. భారతములోని ధర్మవ్యాధుఁడు ఏదో చెప్పితప్పించుకొన్నట్లు ఈ శ్రోత్రియసంతతికూడ, మేముగా ఆవులను జంపలేదు; ఇతరులు చంపి వండిపెట్టిన దానినే ఆరగింతుమని అనవచ్చును. ఈ మాంసాహార విషయమై మచ్చునకై వైదికములోని ఒకటిరెండు లక్ష్యముల నిచ్చెదను:–

| | |
|---|---|
| ఋగ్వేదము:–<br>మంత్ర. 1. అను. 2.<br>సూ. 161. | ‘శ్రోణే మేక ఉదకం గామ వాజతి మాంస మేకః<br>పింశతి సూనయా భృతమ్ ఆనిమ్రుచః శకృదేకో<br>అపా భరత్కింస్విత్రేభ్యః పితరా ఉపానతుః’ |

ఇది – ఒక ఆవును గోసిన ఘట్టము. ఆ కోసినపుడు ఆ నెత్తురు ఒకఁడు పాత్రలో పట్టుచున్నాఁడఁట. ఇంకొకఁడు కత్తి చేతఁబట్టి ఆ కండలను వేఱువేఱుగా నఱికి ప్రోవులు పెట్టుచున్నాఁడఁట. వేఱొకఁడు దానిపొట్టలోని మలమూత్ర భాగమును వేఱుచేసి ప్రక్కగా ఉంచుచున్నాఁడఁట. పుత్త్ర స్థానీయులగు ఋభువులు ఇట్టిపనులన్నియు నెఱవేర్చుచుండఁగా యజమానులగు భార్యాభర్తలు యాగకార్యములొనర్తురఁట. ఇంకొక్కటి:–

ఋగ్వేదము – మంత్ర 1. అను. 22. సూ. 162.

‘యత్తేగాత్రా దగ్నినా పచ్యమానా దభిశూలం నిహతస్యా
వధావతి మాతద్భూమ్యా మాశ్రిషన్మాతృదేవేషు
దేవేభ్య స్తదుశద్భ్యో దాతమస్తు.’

# 'బ్రాహ్మణో మమ దేవతా'

ఆదిలో, జాతి – వర్ణ – కులగోత్రాది భేదములే లేని ఈ దేశములో పురాణయుగమున చాతుర్వర్ణ్యవ్యవస్థను సృష్టించి దాని కనువగు తీరులో సర్వవిధాల కథలు పన్ని నిమ్నోన్నతము లేర్పఱిచి జాతిమాత్రోపజీవులను తయారు చేసిరి. ఈ కథలకు మూలబంధముగా వైదిక వాఙ్మయములోను లౌకికవాఙ్మయములోను విశిష్య – గీతాది గ్రంథములలోను 'చాతుర్వర్ణ్యం మయా సృష్ట' మిత్యాది కారికలు – సూత్రములు దూర్చిరి. ప్రక్షిప్తములుగాఁ దూరిన ఆ భాగములే మూలగ్రంథములలో ఓతప్రోతములుగాఁ గలసిపోయి నోరు గలవారిచే ప్రచారమున కెక్కి పామరజనములో పరమ ప్రమాణముగా – భగవంతుని మాటలుగా – ఉపదేశసారముగా – సదాచారముగా స్థిరపడిపోయినవి. ఆ కాండలో పుట్టి పెరిఁగి బలుపుపొలుపులు సంపాదించుకొన్నవానిలో 'బ్రాహ్మణో మమ దేవతా' అన్న కారిక ఒకటి. ఇక్కడ కారిక అనఁగా 'జి.వో' అన్నమాట. అనఁగా ప్రభుత్వ శాసనము. దీనిని ముమ్మందు నేర్పి సోదాహరణముగ పిట్ట కథలతో ఊకదంపుడుగా బోధించి, ఏదైన నేర్చుకొమ్మనియు ఆ కారికను ఉపేక్షించినను దిరస్కరించినను మహాపాతకము చుట్టుకొనుననియు విశ్వాసము కలిగించిరి. అనఁగా – అది చిన్నదిగాని పెద్దదిగాని ఏ పని చేయఁదలపెట్టినను 'బ్రాహ్మణుఁడు నా పాలిట దైవము' అని నమ్మి ఆ దృష్టితో ఉన్నచో సాఫల్య మందునని పామరులకు నేర్పిన బాలశిక్షలోని ప్రథమసూత్రము.

ఈ సూత్రములోని విశ్వాసముతోనే పెనవైచికొని పాయసములో పుట్టి పెరిఁగిన రాజే రామరాజు. ఆ విశ్వాసమునుబట్టియే ఆతని కనుచరులు వందిమాగధులు పెక్కు మంది ఆతని చుట్టును జేరి నడపించిరి. వారే, ఆతఁడు చేసిన రాజ్యమును 'రామరాజ్యమని' ఒక పరిభాషగా ఏర్పఱిచి శ్లాఘించిరి.

అసలు, రామరాజ్య మనఁగా 'అన్నమో రామచంద్రా'యని ఆ బాలగోపాలము ఆఁకటిమంటలచే అలమటించిన రాజ్యము. దేశములో 'ఆలన – పాలన' సరిగా లేక పదునాలుగేండ్లు బగ్గముపాడై రాజ్యవ్యవస్థ తాఱుమాఱై పంటలు లేక తిండి చాలక 'అలో లక్ష్మణా' యని ఏడ్చిన రోజులు – ఆ రోజులు. లేదా, తాను జేసిన 'ఘనకార్యముల'

వలన ఇల్లాలు సీత చేతినుండి జాఱిపోఁగా 'ఆలో! లక్ష్మణా' అని ఏడ్చినరోజులు – ఆ రోజులు. అధునాతనులలో కొందఱు నేఁడు మనకు దక్కిన 'స్వరాజ్యమును' రామరాజ్యముగాఁ జేసికొనవలెననియు అదే మనకు ధ్యేయమనియు అదే మనకు శ్రేయోరాజ్యమగుననియు పాట పాడెదరు. అనఁగా ఈ దేశములో మఱల వశిష్ఠాదులు అవతరింపవలెను. ఎద్దు ఈనెననఁగా గాటఁ గట్టివేయు మనవలసినవారు పుట్టవలెను. వారు పెట్టిన శిక్షలో ప్రజాసామాన్యము బ్రదుకవలెను. శంబూకాదులు చావవలెను. అని రామరాజ్యకాంక్షుల ఆకాంక్ష. ఆ నాఁడు వశిష్ఠాదుల కంత ప్రాభవము ఎట్లు లభించెను? వారు బ్రాహ్మణులైరి కావున. బ్రాహ్మణుఁడన్నమాటయే ఉచ్చస్థితికిఁ దేఁగల శక్తి ఏర్పడినది. బ్రాహ్మణుఁడుకావుననే అగస్త్యుఁడు మహాసముద్రమును పుక్కిటఁ బట్టఁగలిగెను; కొండను ఆఁపఁగలిగెను. ఇంకొకఁడు కొంగను పడఁగొట్టఁగలిగెను. మఱొకఁడు క్షత్రియులను జంపఁగలిగెను.

ఇట్టి పిట్టకథలు సోదాహరణముగ సుస్వరముగ ఊరూర – నోరార వినిపించి బోధించి ప్రచారమునకుఁ దెచ్చుటచే 'బ్రాహ్మణమహిమ' వెల్లడియైనది. అయితే, బ్రాహ్మణుఁడనఁగా ఎవ్వఁడనిమాత్రము ఇప్పటికిని సహేతుకముగ నిర్ణయింపను వీలులేదు. ఆ శాస్త్రాలలోనే ఆ పురాణాలలోనే నిర్వచించిన బ్రాహ్మణశబ్దమునుబట్టి నిరూపింపఁ దగిన బ్రాహ్మణుఁడు, ఇప్పుడు కాదు – ఎప్పుడును గన్పింపఁడు; కలియుగమం దసలు బ్రాహ్మణుఁడే ఉండఁడని బృహన్నారదీయము పలికినది.

ఆర్షయుగములో మనకుఁ గన్పించు ఋషినామధేయులందఱు కులగోత్రాదులే గాక, నేఁడు మనము భావించు పుట్టుకలుగాని – అమ్మ, అయ్యలుగాని లేని బిడ్డలుగానే జన్మించిరి. దారిని బోవు ఏ సుందరాంగినో ఎవఁడో చూచి మోహించుట – వీర్యస్ఖలన మగుట – దానిని వారిలో ఒక వ్యక్తి పదిలముగాఁ దీసికొని వెళ్ళి కుండలోనో – దొప్పలోనో దాఁచుకొని కోడివలె పొదుగుట – కొన్నాళ్ళకో కొన్నేండ్లకో ఏదో బిడ్డవెలుపలికి వచ్చుట – వారిలోఁ గొందఱు అప్పటికప్పుడే నూనూగుమీసాల నూత్నయౌవనముతో ప్రయాణము కట్టుట, ఇట్టివి ఆ నాఁటి పుట్టుకలు – పురుళ్ళు, ఆ వ్యక్తులే ఆవల ఏదో జ్ఞానము సంపాదించి కొందఱను వశీకరించుకొని ఋషులుగ – మహర్షులుగ – రాజర్షులుగ – జ్ఞానులుగ పరిణమించిరి. వారినే కొన్నాళ్లకు బ్రహ్మణ్యులుగా భావించిరి. వారే బ్రాహ్మణులు. వారియెడఁ జూపవలసిన భక్తి పేరే బ్రాహ్మణభక్తి. వారే ఈ భూమికి దేవతలు. కావున గ్రంథాలలో వారే భూదేవతలుగా పరిఢవించిరి. వారిని జూపి వారి మహిమలు నేర్పి బ్రాహ్మణ భక్తిని బోధించిరి. వ్యక్తిగతముగా జ్ఞానము గల మూర్తిని దేవతనువలె పూజింపవలె నన్నచో ఆక్షేపింపఁదగదు. జాతి మాత్రోపజీవినిగూడ ఆరాధింపవలె ననుట అపరాధముగా భావింపవలెను.

# వాలివధ

ఇతరులకు దక్కిన ఫలిత మెట్లున్నను రామునకు దక్కినది సీతావియోగమే. చేసికొన్నవానికిఁ జేసికొన్నంత మహాదేవ. 'అవశ్యమనుభోక్తవ్యం శుభాశుభకర్మ'.

నరుఁడుగా పుట్టిన శ్రీమన్నారాయణునకు ఈ జన్మములో వానరులే తోడైరి. నరజన్మమునకు వానరజన్మము పూర్వదశ యందురుకదా! వాలి – సుగ్రీవులలో వాలి మహా శూరుఁడు. వాలితో మైత్రి చేసినచో ఈ రెండవ సమస్య క్షణములోఁ దేలిపోవును. అప్పుడు రామావతారఫలితము ఉండదు. పైగా – రెండుకత్తులు ఒక ఒఱలో ఉండనేరవు. వాలిసుగ్రీవులయు హనుమదాదులయు జాతకములు సర్వము ఇంతకుఁ బూర్వమే వినియుంటిమి. జనకమహారాజు పురోహితుఁడైన శతానందునిబట్టి ఆతని తల్లియైన అహల్యను బట్టి శ్రీరామసుగ్రీవాదుల స్నేహము బలపడినది. ఈ స్నేహము బలపడిన కొలఁది బలవంతుఁడైన వాలితో విరోధము దృఢపడినది. మొదటి యుద్ధములో శ్రీరామసుగ్రీవులకు శృంగభంగమైనది. రెండవతూరి రాముఁడు కుట్రతో విజయము కొట్టుకొని వచ్చెను.

రాక్షసవధతో మనకిప్పుడు పనిలేదు. వ్యర్థముగా హింసాధోరణిలో ప్రవర్తింపరాదు – అని ఎన్నోరీతుల సీత మొత్తుకొన్నను ఆమెమాట పెడచెవిని బెట్టి ఘోరమైన 'మారణకాండ' కావించి శ్రీరాముఁడు తత్ఫలితము అనుభవించినట్లే, రెండవ యుద్ధములో ఏదో శంకించి పోవలదని భార్య తార, బ్రతిమాలినను భంగపడినను వాలి, ఆలి మాట వినక యుద్ధమునకే పోయి దెబ్బ తినెను. ఈ రామాయణగాథలో మూవురే మూవురు మహావీరులు. ఒకఁడు శ్రీరాముఁడు; రెండవవాఁడు వాలి; మూఁడవవీరుఁడు రావణుఁడు. ఈ ముప్పురకు వారివారి ధర్మపత్నులు అదనులో పద నెఱింగి అనేకాంశములు బోధించిరి; వారివారి యుద్యమములు మానుకొనవలెనని ప్రార్థించిరి. వీరిలో ఒక్క మగఁడును మగువమాట వినలేదు. దాని ఫలితము ఆ ముప్పురు అనుభవించిరి.

తనవాని మెడలో పూలదండ వేసి హనుమంతుని ప్రక్కగాఁ బెట్టుకొని తమ్ముని కాపుదలగా దగ్గఱ ఉంచుకొని చెట్టుచాటున నక్కి శ్రీరాముఁడు వాలిపై తీవ్రబాణము

వేయఁగా ఆతఁడు నేలఁ గూలినను ఆతని దేహకాంతిగాని ప్రాణములుగాని ప్రతాపముగాని ఏమాత్రము విడువలేదఁట.

శ్లో॥ 'వేగేనాభిహతో వాలీ నిపపాత మహీతలే,
**ఇంద్రధ్వజ** ఇవోద్ధూతః పౌర్ణమాస్యాం మహీతలే
ఆశ్వయుక్సమయే మాసి గతశ్రీకో విచేతనః॥'

(కిష్కింధ. 16స. 36)

ఆశ్వయుజమాసమున పూర్ణిమనాడు ఉత్సవము ముగిసినపిమ్మట నేలమీఁదఁ బడవేసెడి ఇంద్రధ్వజమువలె రాముని బాణవేగమునకు వాలి, నేలమీఁదఁబడెనఁట. గౌడదేశములో ఆ పూర్ణిమనాఁడు ఇంద్రుని ఉద్దేశించి ధ్వజ మొకటి స్థాపించి ఆ వేడుక ముగిసినపిదప దానిని బడఁగొట్టెదరఁట. ఇక్కడ – ఇంద్రధ్వజమని దేశాచారమును జెప్పు కాక ఇంద్రశబ్ద స్ఫూర్తివలన ఇంద్రునిబిడ్డయైన వాలికూడ పతన మందెనన్న సారస్యము వాల్మీకిరచనలో స్ఫురించును. 'ఉపమా – కాలి దాసస్య' అని కితాబు పొందిన కవికులగురువైన కాలిదాస మహాకవికి ఈ యాదికవి ఆదర్శకవి యనుటలో ఇట్టివనేక తార్కాణము లున్నవి. ఆస్తాం తావత్!!

ఈ వాలివధలో వాలి, రామునితోఁ బలికిన పలుకులు కొన్ని విందము:–

రామలక్ష్మణు లిద్దఱు వాలివద్దకు వచ్చి నిలిచిరి. ఆ యిర్వురను వాలి తేఱిపాఱఁ జూచి రామునితో నిట్లనియెను:–

'రామా! నీవు మహారాజకుమారుఁడవు. శాస్త్ర ప్రియుఁడవు. ఆచారవంతుఁడవు. సత్కులసంజాతుఁడవు. వీరాధివీరుఁడవు. అట్టి నిన్ను నేను మార్కొనక ఇంకొకనితో యుద్ధము చేయుసంబరములో ఉండఁగా ప్రక్కవాటుగా నన్నుఁ గొట్టుటవలన నీకు దక్కిన ఘనత ఏమి? ఇంద్రియనిగ్రహము – చిత్తప్రశాంతి – సహనము – ధైర్యము – సత్యము – పరాక్రమము – అపరాధులను దండించుట, ఇవి రాజుల కుండవలసిన సద్గుణములు. ఈ గుణములన్నియు నీ యందున్నవని తెలిసి, అద్దాన నీవు నాకేమియుఁ జెఱుపు సేయవని తలఁచి, తార మాటలు కూడ సరకు గొనక సుగ్రీవునితో యుద్ధము చేయవలయునని వచ్చితిని. నిన్నుఁ జూచిన పిదప నీ స్వభావము – నీ తత్త్వము నా కర్థమైనవి. నీ బుద్ధి బొత్తిగాఁ జెడిపోయినదని తేలినది. లోకులను వంచించుటకై ధర్మధ్వజమును ధరించితివి. అట్టి అధార్మికుఁడవే కావు; పాపాచారుఁడవు; గడ్డి కప్పిన బావివంటి వాఁడవని ఇప్పుడే తెలిసికొంటిని. పైకి సత్పురుషుల వేషము దాల్చి ధర్మమనువంకతో నీ స్వరూపమును దాఁచుకొని నివుఱు గప్పిన నిప్పువలె పాపాత్ముఁడవై ఉందువని ఇంతకు ముందు ఎఱుఁగనైతిని. నీకుఁగాని నీ పట్టణమునకుఁగాని నీ దేశమునకుఁగాని నే నేమైన

# రామరాజ్యము

రాజ్య కార్యములన్నియు ముగిసినపిదప శ్రీరాముని పరిపాలనము ప్రారంభ మాయెను. ఆతఁడు పదునొకండు వేల సంవత్సరములు రాజ్యము చేసెనఁట.

'దశవర్ష సహస్రాణి దశవర్షశతాని చ, భ్రాతృభి

స్సహితశ్శ్రీమాన్ రామో రాజ్య మకారయత్'.

(యుద్ధ. 131. స. 100 శ్లో.)

బ్రహ్మాండమైన అశ్వమేధయాగములు నూఱు గావించెనఁట.

ఆతని పరిపాలనములోని విశేషములు విందము:–

శ్రీరాముఁడు రాజ్యములో కాలు పెట్టఁగానే ఆధివ్యాధుల జాడయే లేదఁట. కఱువు కాటకముల మాటయే వినఁబడదఁట. తండ్రులుండఁగా కొడుకులు చావరఁట. ఆఁడువాండ్రు వితంతువులే కారు; సర్వదా పతివ్రతలుగానే ఉందురు. ఆధిదైవిక – ఆధ్యాత్మిక – ఆధిభౌతిక భయములే, లేవఁట. కృతయుగమువోలె శ్రీరాముఁడున్న త్రేతయు రాణించెనఁట. ఆతఁడు బ్రాహ్మణ ధర్మానుసారముగ పరిపాలించుటఁ జేసియు లక్షలకొలఁది ఆవులను కోట్లకొలఁదిసొమ్మును బ్రాహ్మణులకు ధారవోయుటచేతను వర్ణాశ్రమ ధర్మములు కట్టుదిట్టముగా ఆతఁడు చేయుటవలనను ఆతని రాజ్యము పవిత్రమైనదఁట. దేశములో దొంగలన్న మాటయే వినరాదు. అందఱు ధర్మపరాయణులై యుందురు. ప్రజలలో పరస్పరము భేదభావములే కానరావు. ప్రజలు శోకదూరులయి పుష్టియుఁ దుష్టియుఁ గలిగి వేలకొలఁది యేండ్లు బ్రదుకసాగిరి. ఎందుఁ జూచినను ఎక్కడ విన్నను ప్రతివ్యక్తినోటను 'రాముఁడు– రాముఁ'డన్న ముచ్చటలే వినవచ్చును. అంతయు రామమయమై పోయెను. ఇట్టి శుభమైన ఘట్టము లనేకములు రామరాజ్యములో వెలసినవఁట. (యుద్ధ. 131. స.)

ఇంతటి పవిత్రమైన రామచరిత్రను జదివినవాఁడు విన్నవాఁడు పుత్రపౌత్రాదులతో స్వర్గసౌఖ్యములు జుఱ్ఱు కొనునఁట. ఈ రామాయణమును బ్రాహ్మణుఁడు పఠించినచో

వేదవేదాంతవిదుఁడు శబ్ద బ్రహ్మపారీణుఁడు నగునఁట. క్షత్రియుఁడు పఠించినచో సామ్రాజ్యమును పొందునఁట. వైశ్యుఁడు పఠించినచో బేరసారములు పెరిఁగి ధనధాన్యములు గడించునఁట. ఇఁక శూద్రుఁడు పఠించినచో కులము వారిలో గొప్పవాఁడగునని చెప్పి, అమ్మయ్యో! అని వెంటనే నాలుక చాఁచి ఔదు గఱచి, వాఁడు రామాయణమును పఠింపరాదుసుమా! పఠించినచో వానికి పాపమే వచ్చును. అయితే, వానికి ఒక సదుపాయము ఉన్నదఁట. ఏది? ఆ శూద్రజాతికి వేదమువంటి ఈ రామాయణము పఠించుట **న్యాయ్యము కాదు కావు**న ఇక్కడ మాటవరుసకు 'పఠించుట' కర్థము బ్రాహ్మణులవలన వినుట యనియే గ్రహింపవలయును. అని పాపము శూద్రజాతికి అనువుగా వ్యాఖ్యాత లనుగ్రహించిరి.

'శూద్రస్య సర్వదా అనధికారాత్ శూద్ర ఇత్యత్ర **పఠన్నితి** నానుషజ్యతే. కింతు - శ్రుణ్వన్నితి అధ్యాహ్రియతే. శ్రవణస్యా ఽపి మహాఫలత్వవచనాత్' – గోవిందరాజు.

'శూద్రోఽపి జనః త్రైవర్ణికదాసః–

అత్రశ్రుణ్వన్నిత్యధ్యాహారః–మహేశ్వరతీర్థులు

(వాల్మీకము బాల. 1 స. 100శ్లో.)

ఇఁక – ఈ రామరాజ్యములోని సౌభాగ్యము – ఫలశ్రుతిలోని విశేషములు చూతము:–

ఈ రాజ్యములో ఆఁడువాండ్రు విధవలు కారఁట. అసలు ఉండరట. అనఁగా – భర్తలు చావరా? లేక, భార్యలు సహగమనము చేసెదరా? దశరథుఁడు పోయిన పిదప రాజునగరిలోనే విధవలు మనకుఁ దెలిసినవారే ముప్పురు లేరా! తక్కిన ఉంచుకొన్న తెచ్చుకొన్న భార్యలమాట అట్లున్నను. ఈ ముప్పురిమాట ఏమి! వారు వృద్ధవయస్సులో ఉన్నారు కాన, అవతారపురుషుల అమ్మలు కావున ఈ విధవాత్వము వారికంటదా! వాండ్రు సహగమనము చేయక పోయినను, బ్రదికియున్నను విధవలు కారనుటకు ఒక వ్యాఖ్యాత సెలవిచ్చిన కారణ మిదిగో చిత్తగించుఁడు:–

భర్తయంశమే పుత్రులలో ఉండునుగావున, భర్త పోయినను ఆతని ప్రతినిధులైన పుత్రులున్నప్పుడు వాండ్ర తల్లి విధవ కాదని తీర్పు. ఈ తీర్పు రామాదుల తల్లులకు మాత్రమేసుమా! లేనిచో భర్తలు పోయినను మగబిడ్డలున్న తల్లులందఱు విధవలు కాక ఈ వ్యాఖ్యాత తీర్పునుబట్టి సుమంగలులే – లేదా – పుణ్యస్త్రీలే కావలసివచ్చును. ఔరా! ఏమి వింతవ్యాఖ్యానము!! ఇఁక – తండ్రు లుండఁగా తనయులు చావరనుటలో పెద్ద 'కుంభకోణ' మున్నది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ramayana+Rahasyalu**

* * *